# బావ తమరు భామ ఎవరు?

-రాధ



"**జ్యోతీ... జ్యోతీ!**" గట్టిగా ఓ అయిదారుసార్లు పిలిచింది పార్వతమ్మ, మేడ మెట్లెక్కే ఓపికలేక క్రింద మెట్టు దగ్గరే నిలబడి.

మేడమీద తన గదిలో కూర్చుని పర్సనల్ స్టీరియోలో ఆడియో కేసెట్ పెట్టుకుని సినిమా పాటలు వింటూ కూనిరాగాలు తీస్తున్న జ్యోతికి తల్లి పిలుపు చేరే అవకాశం లేదు చెవుల్లో కుక్కుకున్న హెడ్‌ఫోన్స్ మూలంగా.

చెల్లెలు శృతి వచ్చి తలుపు బాదితేనే కాని అసలు విషయం అవగాహన కాలేదు ఆ నవయవ్వన నాజూకు కుమారికి.

"ఏమిటే నాకేదో బ్రహ్మచెముడు పట్టినట్టు తలుపులు తెగ బాదుతున్నావు" కసురుకుంది జ్యోతి చెల్లెలు శృతిని నమిలి తినేసేటట్లు కోపంగా చూస్తూ.

"అమ్మ నీ కోసం క్రింద నుంచి తెగ అరుస్తోంది... వినపడలేదా నీకు... అవునులే ఎందుకు వినపడుతుంది... ఆ సంగీతం మాయలోపడి మైకం కమ్మి వుంటుంది..." చివరి మాటల్ని మరమరాల్లా నోట్లో నమిలేసి మ్రింగేసింది శృతి.

అక్కకి కోపం తెప్పిస్తే తనకి వరిగేది ఏమిటో బాగా తెలుసు ఆ పది హేనేళ్ళ చెల్లెమ్మకి.

"ఎందుకట..." క్లింట్ ఈస్ట్‌వుడ్‌లా ఓ పొడి పొడి ప్రశ్న వేసింది జ్యోతి కేసెట్ మార్చి మరొకటి పెట్టుకుంటూ.

"ఓ అరగంట క్రితం మావయ్య, బావ వచ్చారు... అమ్మ సంగతి నీకు తెలుసుగా... వాళ్ళ అన్నయ్య వస్తే ఎంత హడావిడి చేస్తుందో..."

"అది సరేకాని... ఇంతకీ నాతో పనేమిటంట..." ముక్తసరిగా మాటలు కట్ చేసింది జ్యోతి.

"ఏమో.. నాకేం తెలుసు.."

అక్క వింటున్న ఆడియో కేసెట్లలో ఇంగ్లీషు కేసెట్లు ఏమైనా ఉన్నాయేమోనని ఆపేక్షగా కెలుకుతోంది శృతి.

చెల్లి చేతిమీద చిన్న దెబ్బవేసి - "ఛీ ... తలుపులు బాదేముందు అసలు విషయం ఏమిటో ఆ మట్టి బుర్రకి కాస్త పట్టించుకుని రావాలి అన్న బుద్ధి ఉండక్కర్లేదూ..." అంది జ్యోతి విసుగ్గా.

"భలే దానివేనే అక్కా... మట్టిబుర్రకి బంకమట్టి తప్పించి ఇంకేమీ పట్టదని నువ్వే కదే నన్ను ఎప్పుడూ దెప్పి పొడుస్తావు..."

అక్కడ మాటల్ని అక్కకే అప్పగించి అక్కడ నుండి జారుకుంది శృతి. ఎత్తిన రాగాన్ని ఎవరో నోరు నొక్కి ఆపేసినట్టు.

"సిగ్గు లేకపోతే సరి..."

వెనుక నుండి మాట విసిరి కూర్చున్న చోటు నుండి లేచింది జ్యోతి.

జారిన చున్నీని సర్దుకుంటూ ఎదిగి ఎత్తవుతోన్న హృదయ భారాన్ని అపురూపంగా కప్పుకుని క్రిందకి కదిలింది జ్యోతి గత్యంతరంలేదన్నట్టు ముఖం అదోకలా పెట్టి.

వంటింట్లోకి వచ్చిన రెండో కూతురుని చూసీ చూడగానే -

"ఏం చేస్తున్నావే జ్యోతీ.. నోరుపడిపోయేలా తెగ అరుస్తున్నాను.. ఉలకవు, పులకవేంటే..." అంది పార్వతమ్మ కసురుకుంటూ.

"అదికాదే అమ్మా... నువ్వు నిజంగా అరిచి వుంటే నాకు వినపడే వుండేది. నాకు తెలుసుగా మావయ్య వస్తే నువ్వు అరవవని.." ఫక్కున నవ్వి-

"ఏదో నోట్లో నా పేరు తలచుకుని వుంటావు" అంది జ్యోతి తల్లి భుజాలమీద చేతులు వేసి గారం చేస్తూ.

"పైకి పద్దెనిమిదేళ్ళు వచ్చాయి... కాలేజీ చదువులు చదువుతున్నావు... కాని కాస్త మర్యాద, ఒబ్బిడి మాత్రం రాలేదు... ఏం పిల్లలో ఏమిటో... మా చిన్నప్పుడైతేనా..." వంట పనికానిస్తూ ఉపన్యసించబోయింది పార్వతమ్మ.

"ఆ... ఆ... ఆ..." మధ్యలోనే తల్లి మాటలు తుంచేస్తూ - "నీ చిన్ననాటి చిలిపి చేష్టలు ఇప్పుడెందుకు కాని... ముందు నాతో నీకు ఏంపని పడిందో చెప్పేసెయ్... సూపర్‌గర్ల్‌లా వెంటనే చేసేస్తాను" అంది జ్యోతి ముచ్చటగా.

"మా అన్నయ్య.. మీ బావ వచ్చారు... ఈ ట్రేలో ఫలహారాలు, కాఫీ పెట్టేస్తాను... తీసుకు వెళ్ళి ఇచ్చి... మర్యాదగా మావయ్యని, మీ బావని పలకరించి... కూర్చుని కాస్సేపు మాట్లాడు... అర్థమయ్యిందా" ఆదేశించింది కూతురుని పార్వతమ్మ.

"ఇంకా నయం తినిపించి రమ్మన్నావు కాదు.."

"ఏమిటే ఆ వాగుడు..."

"అబ్బెబ్బే... ఏదో జోక్‌కి అన్నానే అమ్మా... మరీ ఇంత ఆవేశం ఆరోగ్యానికి అంత మంచిది కాదే..."

"ఉ... సర్లే... అధిక ప్రసంగం తగ్గించి.. మర్యాదగా మావయ్యతో మాట్లాడు" కూతురిని మరో సారి మందలించింది పార్వతమ్మ ట్రేలో కప్పులు వగైరా సర్దుతూ.

"అవునే అమ్మా ఇంతకీ రవి ఎందుకు వచ్చినట్టు... మావయ్య వచ్చాడంటే ఏదో గెస్ట్‌లా వచ్చాడు అనుకోవచ్చు..." అడిగింది జ్యోతి.

"అత్త ఇంటికి అల్లుడు ఎందుకు వస్తాడే తల్లీ..." పార్వతమ్మ ముఖంలో ఏదో తెలియని సంతృప్తి, సంతోషం కొలనులో ఎర్రతామరలా పండి వికసించాయి.

"ఏడిసినట్టుంది.. నేను అడిగిందొకటి..నువ్వు చెప్పేది ఇంకొకటి..." విసుక్కుంది జ్యోతి ఆ



వింత ధోరణి నచ్చక.

''రేపోమాపో ఈ ఇంటి అల్లుడవుతాడే వాడు.. వాడికి ఆ హక్కు పుట్టుకతోనే వచ్చేసింది... ఏమిటనుకున్నావో'' అంది పార్వతమ్మ అధికార దర్పం చూపిస్తూ.

''ఎవరో ఆ కట్టుకునే దుర్భాగ్యురాలు...''

''ఛీ... నీ నోరుపడ.. ఏమిటా పాడు మాటలు... వెళ్ళి బావని ముద్దుగా పలకరించు... ఊ..'' ముందుకు తోసింది కూతురిని పార్వతమ్మ. ట్రే ఎత్తటానికి వంగిన జ్యోతి ఛాతీమీద నుండి ఉల్లిపొరలాంటి చోళీ జారిపడింది. ఆ దృశ్యం కాస్త పురాతన కాలం నాటి పార్వతమ్మ కంటపడింది.

''అవ్వ...'' ఎడం చేత్తో నోరు నొక్కుకుంటూ- ''అసలు నీకు బుద్ధీ, జ్ఞానం వుందటే... మొన్నటి నుండి చెప్తున్నాను మీ మావయ్య వస్తున్నాడు, కాస్త చీర కట్టుకుని, జడ వేసుకుని, బొట్టు పెట్టుకోవే అని... అహ.. మీ నాన్నలాగే నీకూ కాస్త తలతిక్క... ఛీ... వయసొచ్చిన పిల్లవి, పెళ్ళీడు వచ్చిన దానివి.. కాస్త వళ్ళు కప్పుకుని ఒబ్బిడిగా వుండకపోతే ఎవడు కట్టుకుంటాడే నిన్ను... ఆ జుట్టు విరబోసుకోటం ఏమిటి... ఆ బోసి నుదురు ఏమిటి.. అవ్వ.. ఎవరైనా చూస్తే నవ్విపోతారు... అసలు ఇష్టం వుండదే మీ మావయ్యకి పోకిరీ వేషాలంటే...'' అంది పార్వతమ్మ ఆత్రంగా.

''చక్కగా చీర కట్టుకుని, శిఖ వేసుకున్నావు కదే నువ్వు... శుభ్రంగా ఆ కాఫీ టిఫెన్ ఏదో నువ్వే తీసుకువెళ్ళి ఇవ్వకూడదటే. ఏ గొడవా వుండదు.''

''నోర్ముయ్... మాటకిమాట సమాధానం చెప్పటం గొప్పకాదే... అందరిచేత శభాష్ అనిపించుకుంటూ గొప్పగా బ్రతకటం నేర్చుకో...'' కోపగించుకుంది పార్వతమ్మ.

తల్లి వేడి ఎలా తగ్గించాలో జ్యోతికి బాగా తెలుసు.

''అదికాదే అమ్మా... చీర కట్టుకున్నానే అనుకో... అస్తమానూ పైట చెంగు జారిపోతూ ఉంటుంది... అది కాస్తా సర్దుకుంటూ నిలబడితే అసలైన అందాలన్నీ అందరికంటా పడిపోతాయి... అప్పుడంతా ఏమనుకుంటారు చెప్పు... అయ్యో దీనిచోద్యం పాడుకాను... పైనా క్రిందా తెలియటం లేదు ఈ పిల్లకి... అవునులే ఆ వయసు అలాంటిది అంటారు. అవునా కాదా నువ్వే చెప్పు...''

నిజమే సుమా అనిపిస్తోంది పార్వతమ్మకి.

''శుభ్రంగా చుడీదార్ వేసుకుంటే ఆ గొడవలు ఏమీ వుండవని అది వేసుకున్నానే అమ్మా... ఓ.కె. నీకు అంతగా నచ్చకపోతే ఇప్పుడే విప్పేస్తాను..'' ఎక్కడలేని తెలివి ఒలకబోసింది జ్యోతి.

మారుమాట్లాడలేకపోయింది పార్వతమ్మ - 'అది నిజమే సుమా' అంది ఆమె మనసులోని సనాతన సాంప్రదాయం.

''ఉ... కబుర్లకేమీ తక్కువ లేదు.. కాస్త ఆ జుట్టయినా ముడేసుకో..'' మరీ రాజీపడితే బాగుండదని చిరు ఆజ్ఞ జారీ చేసింది ఆ పెద్దావిడ.

''ముడేం ఖర్మ... ముచ్చటైన హెయిర్ బేండ్ వుంటే...'' అంటూ కిచెన్ కప్‌బోర్డ్‌లో దాచుకున్న గోధుమరంగు మ్యాచింగ్ హెయిర్‌బేండ్ తీసి విరజిమ్ముకుని వున్న నల్లని కురుల్ని గుట్టుగా బిగించి కట్టుకుంది జ్యోతి.

''ఇదిగో... మీ బావని కూడా కాస్త పలకరించి ఏదైనా మాట్లాడు. అసలే వాడికి సిగ్గు ఎక్కువ...'' మరోసారి హెచ్చరించింది పార్వతమ్మ ముచ్చటగా కనిపించిన కూతుర్ని ఎగాదిగా చూస్తూ.

''నీ మేనల్లుడికా.. సిగ్గా... భలే దానివే నువ్వు... ఏదో గొంతుకలో కరక్కాయ పెట్టుకున్నట్టు ఎప్పుడూ తెగ బిగిసిపోయినట్టు ఉంటాడు. అది పోజో.. పొగరో మరి...'' వెటకరించింది జ్యోతి చిన్న తిలకం బొట్టు నొసటన దిద్దుకుంటూ.

''నా మేనల్లుడికేమే.. రాజాలాంటి కుర్రాడు... అందానికి అందం... చదువుకి చదువు.. అన్నీ వున్నాయి... వాడికేమి లోటు చెప్పు... అలాంటి మొగుడు దొరకాలంటే ఎన్నో జన్మల పుణ్యం చేసుకుని పుట్టి వుండాలి...'' అంది పార్వతమ్మ అన్న కొడుకుని వెనక వేసుకు వస్తూ.

''ఎందుకంట... నా మొగుడో శుద్ధ మొద్దు అవతారం అని చెప్పుకుని మౌనవ్రతం చేయటానికా... లేకపోతే చూస్తూ కూర్చుని ఏడ్వటానికా.''

''నోర్మూయ్.. ఏమిటా పాడుమాటలు...'' కసురుకుంది పార్వతమ్మ.

''అది కాదే అమ్మా... ఆ ముఖానికి ఓ నవ్వు లేదు... నోటికి ఓ జోకు రాదు... ఎప్పుడూ ఓ లాంగ్ ఫేస్ వేసుకుని కూర్చుంటాడు... పలకరిస్తే పలకడు... ఉ అంటే ఉలకడు.. లైఫ్‌ని ఎంజాయ్ చేయలేని మనుషులంటే నాకు అసహ్యం బాబూ...'' అంది జ్యోతి రవిమీద వున్న ఏవగింపుని వెళ్ళగ్రక్కుతూ.

''మా అన్నయ్య పెంపకం అలాంటిదే... ఆ క్రమశిక్షణ, కుదురు, కూరాటం ఈ కాలం కుర్రాళ్ళకి ఎక్కడ వుంటుంది... కుర్రాళ్ళ దాకా ఎందుకు మీ ఆడపిల్లలే బరితెగించి పోతుంటేను...''

అన్నగారి పెంపకంలో తన చిన్ననాటిని గుర్తుకు తెచ్చుకుంటూ మేనల్లుడ్ని సమర్థించుకు వచ్చింది పార్వతమ్మ.

''ఎంతసేపూ నీ చేదస్తం నీదేకాని బావకి వున్న లోటుపాట్ల గురించి కాస్త ఆలోచించనివ్వవు కదా...''

''ఏమన్నావు... ఏమన్నావు.. మళ్ళీ ఓసారి అనవే నా బంగారుకొండ...'' ముచ్చటపడింది పార్వతమ్మ పున్నట్టుండి.

''ఏమిటే అమ్మా... ఏమిటి అనటం...''

''అదేనే... బావా అని.''


''ఏడిసినట్టుంది.. ఏదో నోరుజారి అనుంటాను..'' అనాలోచితంగా ఆ మాట అన్నందుకు చాలా చిన్నతనంగా ఫీలయ్యింది జ్యోతి ఎందుకో!

''నోరు జారికాదే... నాకు తెలుసు... మనసు అటు మళ్ళుతోంది'' కూతురిని ఉబ్బించాలని ప్రయత్నించింది పార్వతమ్మ.

''ఏమిటీ... నీ మేనల్లుడి తీవి చూసి నా మనసు జారిపడి... బోర్లాపడి దారి తప్పిపోతుందను కున్నావా... నూటికి నూరుపాళ్ళు నెవ్వర్... నీ కూతురు అంటే ఏమిటనుకుంటున్నావు...'' అంది జ్యోతి గర్వంగా.

''ఎందుకేతల్లీ అంత పట్టుదల... ఏదో ఒక రోజున మీ ఇద్దరూ భార్యభర్తలవుతారు... ఆ అచ్చటా ముచ్చటా మేం కళ్ళారా చూస్తాం'' ఏదో తెలియని అపనమ్మకం దోబూచులాడింది పార్వతమ్మ కంఠంలో.

''అదంతా నీ భ్రమే అమ్మా... రవికి నాకు పెళ్ళంటే ఆ దేముడు కూడా నమ్మడు.. నేను అంత కంటే నమ్మను... పైకి అంత నెమ్మదిగా వుంటాడు కాని రవికి కూడా లోలోపల చాలా కోర్కెలు ఉంటాయే అమ్మా... మావయ్యకి ఆస్తిపాస్తులు బోల్డంత ఉన్నాయి... రవా మావయ్యకి ఒక్కగా నొక్క కొడుకు... అంటే డబ్బుగల గొప్పింటి బిడ్డ అన్నమాట... మనమేమో మధ్య తరగతి కుటుం




బీకులం... ఏదో నీ ఆరాటం కాని మావయ్య ఇంటికి కోడలిగా వచ్చే అమ్మాయి చాలా గొప్పింటి బిడ్డ అయి వుండాలే... రవి సంగతి నాకు తెలుసు.. అతగాడికి సొట్టబుగ్గలున్న తెల్లని అమ్మాయి కావాలి... నాకు అవేమీ లేవుగా మరి...'' చిన్న బుచ్చుకుంటున్న సూచనలేవీ లేవు జ్యోతి మాటల్లో, పైగా అదో రకమైన దర్పం దర్భగడ్డిలా మొలుస్తోంది ఆమె గొంతుకలో.

''ఛ ఛ.. నా తల్లికేమి లోటు చెప్పు... అందం చందం, చదువు, సంస్కారం అన్నీ వున్నాయి... శుభ్రంగా చీరకట్టుకుని బొట్టు పెట్టుకుంటే సాక్షాత్తు లక్ష్మీదేవిలా వుంటుంది.''

పార్వతమ్మ ఆరాటపడింది 'ఏం పిల్లలో ఏమిటో' అనుకుంటూ.

''గొప్ప గొప్ప వాళ్ళకి కావలసింది లక్ష్మీదేవి లాంటి పిల్లకాదే అమ్మా... సాక్షాత్తు లక్ష్మీదేవే కావాలి... చూడవే నాతో కలిపి నీకు వెనకా ముందూ ముగ్గురు వున్నారే... పైగా ఆ ముగ్గురూ ఆడ పిల్లలే నీకు.. నాన్నకేమో ఓ చిన్నతరహా ఆఫీసర్ ఉద్యోగం.. అక్క పెళ్ళికి మీరెంత అవస్థపడ్డారో నాకు బాగా తెలుసే... మావయ్య వాళ్ళతో మనం సరితూగలేమే.. పైగా రవి అంటే అంత గొప్ప అభిప్రాయం కూడా లేదు నాకు...''

పార్వతమ్మ మనసు పరిపరి విధాలపోయింది కూతురు ఇచ్చిన ఉపోద్ఘాతంతో.

ఫలహారాల ట్రేతో వంట గదిలోంచి కదిలింది జ్యోతి అన్న సంగతి కూడా గుర్తించలేదు పార్వతమ్మ అదొక రకమైన బాధతో బెంగతో!

❀❀❀

గెస్ట్ రూమ్‌లో కూర్చుని కబుర్లాడుకుంటున్నారు గోపాలరావు, పార్వతమ్మ భర్త సాంబశివరావు. ఆ ప్రక్కనే గదికి ఒక మూలాగా ఉన్న టి.వి.లో ఒక దూరదర్శన్ ప్రోగ్రామ్‌లో వస్తున్న సంగీతం పాటలు వింటూ కూర్చున్నాడు రవి.

ట్రే పట్టుకుని దిగిన జ్యోతిని పరీక్షగా చూస్తూ - ''ఏమ్మా జ్యోతీ! నేను వచ్చి గంటయ్యింది... ఇంత ఆలస్యంగానా కాఫీ ఇచ్చేది...'' అన్నారు గోపాలరావు మేనకోడల్ని వేళాకోళం చేస్తూ.

తల్లి వసపోసిందంతా బాగా గుర్తు వుంది జ్యోతికి. అందుకే సమాధానంగా చిరునవ్వు చిందిస్తూ - ''నమస్తే మావయ్యా'' అంది.

''ఎంత పెద్ద దానివైపోయావే తల్లీ'' అన్నారు గోపాలరావు కన్ను వయసుకి కావలసిన అందాలన్నీ రంగరించు కుంటున్న మేనకోడల్ని ముచ్చటగా చూస్తూ.

''ఏమిటి ఆరు నెలలకే...'' ఫక్కున నవ్వింది జ్యోతి.

''ఆరు నెలలేనా అయ్యింది మనం కలుసుకుని...''

''అంతే కద మావయ్యా... సంక్రాంతికి మేమంతా మీ ఇంటికి వచ్చాం... ఇప్పుడు ఎలక్ట్రిసిటీకి రేషన్ రోజులు... అంటే వేసవి శలవులు... నువ్వే చెప్పు ఎన్నాళ్ళయ్యిందో...''

''ఆ... ఆ... నువ్వన్నదీ నిజమేనే...'' కాఫీ కప్పు అందుకుంటూ మేనకోడలి శిరస్సును దీవెనగా తట్టారు గోపాలరావు.

''అంతేలే అన్నయ్యా... ఆడపిల్లలు ఆరు నెలల్లో ఇట్టే ఎదిగిపోతారు...'' అంటూ అక్కడికి వచ్చి మాట కలిపింది పార్వతమ్మ.

''అదీ నిజమేనమ్మా'' అంటూ చెల్లెలికి సమాధానం చెప్పి- ''అమ్మా జ్యోతీ నీ సంగీత సాధన ఎంతవరకు వచ్చింది...'' అని అడిగారు గోపాలరావు.

''ఏది మావయ్యా... అమ్మ నన్ను ఓ పట్టాన వెళ్ళనిస్తేగా... ఆ సంగీతం టీచర్‌కి డిమాండ్ ఎక్కువ.. ఇంటికి వచ్చి ట్యూషన్ ఇవ్వాలంటే చాలా డబ్బులు అడుగుతాడు... నేను బయటకు వెళ్తే పోకిరీ గాలులు తగిలి మైలపడి పోతానని మీ చెల్లెలికి భయం... ఎలా నేర్చుకోమంటావు నువ్వే చెప్పు...'' అంది జ్యోతి చనువుగా.

ఏమిటా మాటలు అన్నట్టు కాస్త కళ్ళు ఎర్రజేసింది పార్వతమ్మ కూతురి వైపు చూస్తూ.

''పట్టుదల వుండాలే కాని నేర్చుకోటం ఎంత సేపమ్మా... అందులో నీలాంటి తెలివైన అమ్మాయి ఇట్టే పట్టేస్తుంది శృతులన్నీ... మీ అమ్మకి నేను

చెప్తాను కాని... గాత్ర సాధన చేయవే తల్లీ నీకు మధురమైన కంఠాన్ని ప్రసాదించింది ఆ సరస్వతీ దేవి...'' అంటూ మేనకోడల్ని పొగిడి ధైర్యం చెప్తూ చెల్లెలి వైపు తిరిగి -

''జ్యోతికి తప్పకుండా సంగీతం నేర్పించమ్మా పార్వతీ...'' అన్నారు గోపాలరావు. నవ్వి తల ఊపింది పార్వతమ్మ మౌనంగా అన్నీ వింటున్న భర్త సాంబశివరావు వైపు అదోకలా చూస్తూ.

కాఫీ కలిపి మరొక కప్పు రవికి అందిస్తూ ''షుగర్ వేసుకుంటావు కదూ...'' అంది జ్యోతి ఓరకంట అతగాడ్ని పట్టి పట్టి చూస్తూ.

ఆమెను పట్టించుకోకుండా ''-థేంక్స్ జ్యోతీ.. ఒన్ స్పూన్ ప్లీజ్...'' అన్నాడు రవి గిరిజాల జుట్టు షాంపూ తాకిడికి పలచపలచగా సాగి ఎగురుతుంటే. హుందాగా సోఫాలో కూర్చుని పాటలు వింటున్న రవిని చూడగానే జ్యోతి మనసులో ఏదో గిలిగింత లాంటిది కలిగింది.

'మనిషి బాగానే ఉంటాడు, ఆ తలబిరుసు కాస్త తగ్గితే ఫర్వాలేదేమో' అది ఆమె వయసు పొంగుల్లో పొంచివున్న అపురూపమైన మనసు చేసిన సందడి.

కాఫీ కప్పు అందుకుంటూ పరాకున ఆమె చేతి వ్రేళ్ళు తాకాడు రవి. ఏదో షాక్ తగిలినట్టయ్యింది ఇద్దరికీ. ఒక్కసారి ఆమె కళ్ళల్లో కళ్ళుపెట్టి చూశాడు.

ఓ మెరుపు మెరిసింది ఆ చూపుల సంగమంలో. తడబాటు కలిగింది ఇద్దరి కదలికల్లో.

''సారీ'' అని చిన్నగా అంటూ కప్పు అందుకుని చేయి వెనక్కు వేసుకున్నాడు రవి.

ఓ రెండు రోజులు హైదరాబాద్‌లో వుంటానికి వచ్చారు గోపాలరావు ఏదో పంచాయతీ పనిమీద.

ఎప్పుడు పట్నం వచ్చినా చెల్లెలి దగ్గర తప్పించి ఇంకెక్కడా దిగడు ఆయన. ఆ అన్నా చెల్లెళ్ళ అనుబంధం ఆత్మీయత అలాంటివి. పార్వతమ్మ కూడా కనీసం సంవత్సరానికి ఒకసారైనా సరే అన్న దగ్గరకి వెళ్తుంది. తల్లీ తండ్రీ తానై పెంచి పెద్ద చేసిన అన్నగారంటే ఆమెకు కూడా ఎనలేని ప్రేమ, గౌరవమూను. దానితోపాటు అన్నగారి భార్య రవికి పన్నెండేళ్ళ వయసప్పుడు కాలం చేయటంతో మేనల్లుడ్ని ఒక కొడుకులా చూసుకుంటూ వచ్చింది. దానితో అనురాగం ఆప్యాయత ఓ సన్నజాజి తీగలా పెరిగిపోయి ఆ రెండిళ్ళ మధ్య సువాసనల పందిరిని వేశాయి.

మూడు సంవత్సరాల క్రితం రవి ఇంజనీరింగ్ కాలేజీలో చేర్తున్నప్పుడు హాస్టల్‌లో వుంటానంటే పార్వతమ్మ బలవంతం చేసింది మేనల్లుడ్ని ''మా ఇంటి ~~దగ్గర~~ వుండి చదువుకోవచ్చు కదా బాబూ -'' అని అడుగుతూ.




''అది కాదు అత్తా... చిన్నప్పటి నుండే నాకు వంటరిగా వుండడం అలవాటు అయిపోయింది... అదీకాకుండా మీకు అనవసరంగా ఇబ్బంది కలిగించటం నాకు ఇష్టంలేదు...'' అన్నాడు మొహమాటపడ్తూ.

ఆడపిల్లల తల్లి పార్వతమ్మ ఆమాత్రం అర్థం చేసుకోలేని మనిషి కాదు. మేనల్లుడి అవస్థ ఇట్టే పసికట్టి ''పోన్లే నాయనా నీకు ఎలా నచ్చితే అలా చేయి'' అంది.

అప్పటి నుండీ అప్పుడప్పుడూ ఏ పండగకో, పబ్బానికో లేక తండ్రి హైదరాబాద్ వచ్చినప్పుడో అత్త దగ్గరికి వస్తుంటాడు రవి.

గోపాలరావు గారు పార్వతమ్మ కంటే పెద్దాయినే అయినా ఆయనకి పిల్లలు మాత్రం చాలా కాలం వరకూ కలగలేదు. లేకలేక పుట్టిన ఏకైక పుత్రుడే అయినా రవిని క్రమశిక్షణలో మాత్రం రవ్వంత లోటురాకుండా చాలా కట్టుదిట్టంగా పెంచుకు వచ్చాడు ఆయన.

హైదరాబాద్‌లో విచ్చలవిడిగా తిరిగే అవకాశం, అదృష్టం భారతదేశ స్వాతంత్ర్యంలా బోల్డంత ఉన్నా అతనిలో ఆ చిన్ననాటి క్రమశిక్షణ, పెద్దలంటే గౌరవ మర్యాదలు చూపటం వంటి లక్షణాలు రవ్వంతైనా సడలిపోలేదు. ఎందుకో రవికి తెలుగు సంస్కృతి అన్నా, సనాతన సాంప్రదాయాలు అన్నా చాలా ఇష్టం. అది తండ్రి వడకట్టిపోసిన కట్టుదిట్టాల కార్యక్రమాల్లో ఒక అంశం కాకపోయినా దానికి కొంత వరకూ కారణం అతడు పుట్టి పెరిగిన పల్లెటూరి వాతావరణం కావచ్చు. మిగతాది మాత్రం వంశ పారంపర్యంగా అతగాడి రక్తంలో ప్రవహిస్తోన్న సంస్కారం అని చెప్పవచ్చు.

ఎప్పటిలా ఆ రోజు కూడా హాస్టల్‌కి తిరిగి వెళ్ళిపోతానన్నాడు రవి. వెళ్ళే ముందు తండ్రితో అన్నాడు - ''ఎల్లుండి మీరు గోదావరికే కదా వెళ్తున్నారు.. నేను సికిందరాబాద్ స్టేషన్‌కి వస్తాను.''

''వీలైతేనే రా...''

''వారానికో, పది రోజులకో ఇలా వస్తుండు రవీ... మరీ ఈ మధ్య రాకపోకలు తగ్గించేశావ్...'' అన్నారు సాంబశివరావు సాగనంపే ముందు మేనల్లుడికి ఓ షేక్‌హాండ్ ఇస్తూ.

''అలాగే మావయ్యా...''

''నిజమే నోయ్... మా చెల్లెమ్మ కూడా అంటోంది నువ్వు అసలు ఇటువైపు రావటం లేదని... చిక్కడపల్లికి, చిక్కనంత దూరంలో లేదుగా మీ హాస్టల్... ఆదివారం పూట రూమ్‌లో కూర్చుని ఏం చేస్తావు... మీ అత్తని చూడటానికి వస్తుండు...'' అన్నారు గోపాలరావు కొడుకుని సుమారు ఆదేశిస్తూ.

తల వూపాడు రవి ''అలాగే నండి'' అంటూ.

''అవును బాబూ... నువ్వు తరచుగా వస్తుంటే మాకు ఆనందంగా వుంటుంది. జ్యోతీ... శృతీ అందరం కూర్చుని సర్దాగా కబుర్లాడుకోవచ్చు'' అంది పార్వతమ్మ.

'సరే' అన్నట్టు చిరునవ్వు చిందిస్తూ తలవూపాడు రవి మరొకసారి.

అన్నీ వింటున్న జ్యోతి - 'ఇంకానయం అష్టాచెమ్మా ఆడుకోవచ్చునన్నావు కాదు' అనుకుంటూ మనసులోనే వెటకరించింది తల్లిని.

''అన్నట్టు చెప్పటం మరిచాను... వచ్చే ఆదివారం లలిత వాళ్ళ ఆయన ఢిల్లీ నుండి వస్తున్నారు... ఓ వారం రోజులు ఇక్కడే వుంటారు... తప్పకుండా వచ్చి కలుసుకో వాళ్ళిద్దరినీ... వచ్చే ఆదివారం భోజనానికి ఇక్కడికే వచ్చెసెయ్..'' అంటూ మరీ మరీ గుర్తు చేసింది పార్వతమ్మ తన పెద్ద కూతురి సంగతి ఎత్తుతూ.

''అలాగే అత్తా...'' మొహమాటం కొద్దీ అందరి మాటలకూ 'ఊ' కొట్టి శలవు అందుకున్నాడు రవి.

వెళ్ళే ముందు ఎందుకో ఒక్కసారి జ్యోతి వైపు చూశాడు. సుమారు అదే క్షణంలో ఆమె కూడా ఆ పనే చేసింది ఏ పైనున్నవాడో చేయమన్నట్టు.

ఏదో మేఘాల్లో మెరుపులా ఆ ఇద్దరి హృదయాల్లో ఏదో తెలియని అనుభూతి తళుక్కున మెరిసింది.

'ఛ మరీ ఇంత బలహీనత పనికి రాదు' అనిపించింది ఒకరికి.

'ఏముందనో అంత గీర... నాకు మాత్రం ఏం తక్కువ' అనిపించింది మరొకరికి.

(సశేషం)